# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 25-11-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ఉత్తర ప్రదేశ్‌లోని అయోధ్య రామజన్మ భూమి ఆలయ ధ్వజారోహణ కార్యక్రమంలో భాగంగా కాషాయ పతాకాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆవిష్కరించారు.**

2. **రాయలసీమ, ప్రకాశం జిల్లాల్లో ఉద్యాన వన పంటలను సాగుచేసేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.**

3. **పరిశ్రమల ఏర్పాటుకు పారిశ్రామిక కారిడార్లను అభివృద్ధి చేస్తున్నామని సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు.**

4. **రాష్ట్రవ్యాప్తంగా 51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతుల నుంచి సేకరిస్తున్నామని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు.**

5. **విజయవాడ నగరాన్ని 2029 నాటికి పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ తెలిపారు.**

==========================

ఉత్తరప్రదేశ్‌లోని పుణ్య క్షేత్రం అయోధ్య రామజన్మ భూమి ఆలయంపై ధర్మ ధ్వజారోహణం కార్యక్రమాన్ని ఈరోజు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరాముని సూర్య వంశానికి ప్రతీక అయిన సూర్యుడు, ఓం, కోవిదార వృక్షం చిహ్నాలతో కూడిన పవిత్ర కాషాయ పతాకాన్ని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆవిష్కరించారు. రామ మందిర ప్రధాన నిర్మాణం అధికారికంగా పూర్తయినందుకు గుర్తుగా ఈ ధ్వజారోహణం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ధ్వజారోహణంతో 2024వ సంవత్సరం జనవరి 22వ తేదీన బాల రాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ తరువాత రామ మందిర నిర్మాణంలో మరొక ముఖ్యమైన మైలురాయి పూర్తయింది. ఈ సందర్భంగా ఆలయంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, భారతీయ సాంస్కృతిక చైతన్యానికి అయోధ్య ప్రతీకగా నిలిచిందని అన్నారు.

వాయిస్..36 సెకన్లు

-------------------------

రాయలసీమ, ప్రకాశం జిల్లాల్లో ఉద్యాన వన పంటలను సాగుచేసేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఉద్యాన వన

పంటల అభివృద్ధిపై సంబంధిత అధికారులతో ముఖ్యమంత్రి ఈరోజు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యాన వన పంటల ద్వారా రైతుల ఆదాయం పెంచేందుకు ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. మారుతున్న ఆహారపు అలవాట్లు, ఆదాయం వచ్చే పంటలసాగు, నూతన సాంకేతికత వినియోగం వంటి అంశాల ద్వారా ఈ పంటలకు ప్రోత్సాహం కల్పించాలని ముఖ్యమంత్రి అధికారులకు దిశానిర్దేశం చేశారు.

---------------------------

రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు పారిశ్రామిక కారిడార్లను అభివృద్ధి చేస్తున్నామని సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ చాంబర్ ఆఫ్ కామర్స్, ఇండస్ట్రీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో విజయవాడలో నిర్వహించిన "ఏపీ చాంబర్స్ బిజినెస్ ఎక్స్ పో" కర్టెన్ రైజర్ కార్యక్రమాన్ని మంత్రి ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, నూతన పారిశ్రామికవేత్తలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామిక విధానాన్ని మరింత సులభతరం చేశామన్నారు. దేశ, విదేశాలలో ప్రతిష్టాత్మకమైన పరిశ్రమలు, సంస్థలు రాష్ట్రంలోని పరిశ్రమలతో అనుసంధానమై ఉత్పత్తిని పెంచే విధంగా కృషి చేస్తున్నామని తెలిపారు.

---------------------------

రాష్ట్రవ్యాప్తంగా 51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతుల నుంచి సేకరిస్తున్నామని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా చాగల్లు, దొమ్మేరు ప్రాంతాల్లో మంత్రి కందుల దుర్గేష్‌తో కలిసి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి రైతుల పంట పరిస్థితులు, ధాన్యం తూకం పరికరాలు, గోనె సంచుల లభ్యత, కొనుగోలు విధానాలను ఆయన నిన్న పరిశీలించారు. ఈ సందర్భంగా నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ, రైతు సేవా కేంద్రాల్లో కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. వర్షాలపై వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ఉచిత టార్పాలిన్లు రైతులకు అందజేస్తున్నామని మంత్రి పేర్కొంటూ,

వాయిస్ 28 సెకన్లు

---------------------------

గోవాలో జరుగుతున్న 56వ భారత అంతర్జాతీయ చలన చిత్రోత్సవం – ఇఫీ ఆరవ రోజుకి చేరుకుంది. ఇందులో భాగంగా నిన్న మరణించిన ప్రముఖ హిందీ చలన చిత్ర నటులు ధర్మేంద్రకు పలువురు చిత్రనిర్మాతలు, నటులు, నిర్మాతలు, పరిశ్రమ నిపుణులు నివాళులు అర్పించారు. ఇక సినిమా ప్రదర్శనలలో రెండవ ప్రపంచ యుద్ధంలో కోహిమా, ఇంఫాల్‌లో జరిగిన యుద్ధాలను తెలిపే మణిపురి డాక్యుమెంటరీ "బాటిల్‌ఫీల్డ్" ఇండియన్ పనోరమా విభాగంలో వరల్డ్ ప్రీమియర్‌గా ఈరోజు ప్రదర్శిస్తున్నారు. అలాగే 'ది జానిటర్', 'డ్రీమ్స్' "ఖోయా పాయా", "బ్యాలెన్స్", "మై ఫాదర్స్ షాడో" చిత్రాలను ప్రదర్శిస్తారు. తమాషా, బర్ఫీ చిత్రాల సినిమాటోగ్రాఫర్ రవి వర్మన్ సినిమాటోగ్రాఫీపై మాస్టర్ క్లాస్‌ను నిర్వహిస్తున్నారు.

---------------------------

విజయవాడ నగరాన్ని 2029 నాటికి పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ తెలిపారు. విజయవాడలోని తూర్పు నియోజకవర్గంలో 93 లక్షల రూపాయలతో నిర్మించనున్న వర్షపు నీటి డ్రైనేజీ నిర్మాణ పనులకు స్థానిక శాసనసభ్యులు గద్దె రామ్మోహన్‌తో

కలిసి ఈరోజు శంకుస్థాపన చేశారు. అనంతరం శివనాథ్ మాట్లాడుతూ,

వాయిస్ ..33 సెకన్లు

---------------------------

అంతర్జాతీయ స్త్రీ హింసా వ్యతిరేక దినంగా ఈరోజు పాటిస్తున్నారు. బాల్య వివాహాలు, వరకట్న వేధింపులు, గృహ హింస, లింగ నిర్ధారణ పరీక్షలు, భ్రూణహత్యలు వంటి వివిధ రూపాల్లో మహిళలపై జరిగే హింసను నిరోధించడానికి ఐక్యరాజ్యసమితి ఇచ్చిన పిలుపు మేరకు ప్రతి ఏటా నవంబర్ 25వ తేదీన స్త్రీ హింసా వ్యతిరేక దినంగా పాటిస్తున్నారు. 'మహిళలు, బాలికలపై డిజిటల్ హింసను అంతం చేయడానికి ఐక్యంగా ఉండాలి' అనే ఇతివృత్తంతో ఈ ఏడాది ఈ రోజును జరుపుకుంటున్నారు.

---------------------------

కేంద్రప్రభుత్వం తీసుకువచ్చిన నూతన కార్మిక చట్టాలను తిరుపతి జిల్లా కార్మిక సంఘాలు స్వాగతిస్తున్నాయి. గతంలో ఉన్న 29చట్టాలను మార్పు చేసి నాలుగు కోడ్స్‌గా అమలు చేయడంపై ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఈ చట్టాల్లో పనికి తగిన సమాన వేతనం వంటివి మరింత సరళీకృతం చేయడం కార్మికులకు ఉపయోగపడతాయని తిరుపతి జిల్లా కార్మిక సంఘం నాయకులు ఎస్.వి.రమణ తెలియజేస్తూ,

వాయిస్ 29 సెకన్లు

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 128వ సంచిక ఈనెల 30వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. "మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈనెల 28వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

---------------------------

మలక్కా జలసంధి సమీపంలో తీవ్ర అల్పపీడనం కొనసాగుతోందని, ఇది పశ్చిమ-వాయవ్య దిశగా కదులుతూ ఈరోజు వాయుగుండంగా బలపడుతుందని భారత వాతావరణ విభాగం తెలిపింది. దీని ప్రభావంతో రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో రానున్న మూడు రోజులపాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రం అధికారి ఎం. వెంకట్రావు పేర్కొన్నారు.

=====================